

సాక్షి చిత్తూరు

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



బోయకొండలో దసరా ఉత్సవాలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఈఓ తెలిపారు. - 10లో



విజ్ఞాన 'కౌశల్'

సర్కారు బడుల్లోని విద్యార్థులకు సైన్స్ టెస్ట్ నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	23
తిరుపతి	34	23
తిరుమల	30	19
గూడూరు	36	26
నగరి	34	24

న్యూస్‌రీల్

రేపే బోయకొండ ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



నాగరాజారెడ్డి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ నూతన కమిటీ సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆలయ పాలకమండలి చైర్మన్‌గా నాగరాజారెడ్డి, సభ్యులుగా పి.రజని, కె.రామ్‌దాస్, జి.భారతి, ఏ.రాజేష్, ఎం.బుజ్జమ్మ, ఎస్.పవన్ కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, సి.లక్ష్మీదేవమ్మ, కె.హైమావతి, డి.రెడ్డెమ్మతోపాటు ఎక్స్ అఫిషియో మెంబర్‌గా గంగిరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

చిత్తూరు అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన పంటల ఈ–క్రాప్ నమోదు జాబితాలను ఆదివారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో ఈనెల 19వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఏమైనా తప్పిదాలు ఉంటే ఆర్‌బీకే సిబ్బందికి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని సరిదిద్దుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ధరణి'తో అధిక వడ్డీ

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో ప్రారంభించిన ధరణి డిపాజిట్ పథకం ద్వారా అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద 450 రోజులకు అత్యధిక వడ్డీ 8 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.50 శాతం అందిస్తున్నామన్నారు. కనిష్ట డిపాజిట్‌గా రూ.1000 నుంచి స్వీకరిస్తున్నామని వివరించారు. డిపాజిట్ దారులకు డీఐసీజీపీ ఇన్సూరెన్స్ రక్షణ ఉంటుందన్నారు. ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు ధరణి పథకం కింద డిపాజిట్‌లకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు.



నగరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

భానూ.. తెలుసు నీ బాగోతం

- తండ్రి మరణానికి కారణమైన చరిత్ర నీది
- కన్నతల్లే ద్వేషించే కొడుకువి నువ్వు
- మహిళలను దూషించే నీచ సంస్కృతి నీది
- టీడీపీ నేత గాలి భానుప్రకాష్‌పై మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి: టీడీపీ నేత గాలి భానుప్రకాష్ బాగోతమంతా తమకు తెలుసని, కన్నతండ్రి చావుకు కారణమైన దుర్మార్గుడని, అతడి వ్యవహారశైలి నచ్చకే కన్నతల్లి సైతం ద్వేషిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. శనివారం పట్టణంలో 'ఛీ ఛీ తెలుగుదేశం.. ఆపండి మీ దొంగ నాటకం' అంటూ కేవీపీఆర్ పేట నుంచి ఓంశక్తి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష నిర్వహణ కోసం ఆస్పత్రి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను చూసి భయపడి కారుతో లారీని ఢీకొని పరుగులు తీసిన భానుప్రకాష్ దిగజారుడు రాజకీయాలకు తెరతీశాడని ఆరోపించారు. మద్యం మత్తులోని పచ్చమూకలు పక్కన చేరడంతో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి రోజమ్మది భానుప్రకాష్‌లా నీచ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. మా తల్లి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా, తండ్రి ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలందించారని వెల్లడించారు. వారి నీడలో తాము సౌకర్యవంతంగా పెరిగామని చెప్పారు. మా నాన్నకు స్నేహితుడైన దర్శకుడు శివప్రసాద్ ప్రోత్సాహంతో సినిమాల్లోకి వచ్చామని వివరించారు. ఆ రోజుల్లోనే రూ.4కోట్లు పెట్టి సొంతంగా సినిమా తీశామని తెలిపారు. ఆ చిత్రం నష్టాలు మిగిల్చిన సమయంలో రోజమ్మను వివాహం చేసుకుంటానని ఆర్‌కే సెల్వమణి సంప్రదించారన్నారు. ఫెయిల్యూర్ వచ్చిన సమయంలో వివాహం వద్దని పదేళ్లపాటు సినీరంగంలో కష్టపడి విజయాలు సాధించిన తర్వాతే పెళ్లి చేసుకున్న ఉత్తమ వ్యక్తిత్వం రోజమ్మదని వెల్లడించారు. శివప్రసాద్ కోసం రాజకీయాల్లోకి వచ్చి టీడీపీ తరఫున ప్రచారం చేశారని, ఆపై చంద్రబాబు కుల రాజకీయాల కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడ్డారన్నారు. అలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు దూరంగా ఉంటే భూమన కరుణాకరరెడ్డి మహానేత వైఎస్సార్‌ను పరిచయం చేశారని, ఇలాంటి పవర్‌ఫుల్ మహిళ తమ పార్టీకి అవసరమని ఆదరించారని తెలిపారు. ఈ క్రమంలోనే జగనన్న ఆమెకు తగిన ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. రోజమ్మను నగరి ప్రజలు తమ ఇంటి మనిషిలా భావించి రెండు సార్లు గెలిపించడంతో ప్రస్తుతం మంత్రిగా ఉన్నారని వివరించారు. పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్ పాల్గొన్నారు.

9 మంది టీడీపీ నేతలపై కేసు

వైఎస్సార్‌సీపీ నేత ప్రత్యూష్‌కు చెందిన ఎస్ఆర్ మోటార్స్ షోరూమ్‌పై శుక్రవారం దాడి చేసిన 9 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ తెలిపారు. షోరూమ్‌పై రాళ్లు రువ్విన ఈఎస్ శ్రీనివాసన్ (కేవీపీఆర్ పేట), జె.శివకుమార్ (మాంగాడు), దీనదయాళ్ (ముడిపల్లె), తులసిలింగం, ఎంఎం చంద్రశేఖర్ (ఏకాంబరకుప్పం), కన్నయ్య (ఏకాంబరకుప్పం దళితవాడ), టీఎం మాణిక్యవాసన్, వీపీ హరి, కేఎం వడివేలు (పుదుపేట)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



టీడీపీ నేతల వైఖరిపై నిరసన తెలుపుతున్న దివ్యాంగుడు

● బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఊరేగుతున్న విష్వక్సేనుల వారు

తిరుమలలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. - తిరుమల

రేపటి నుంచి కబడ్డీ కోచింగ్

నగరి : పుంగనూరు బీఎంఎస్ క్లబ్‌లో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులందరూ కోచింగ్ క్యాంపునకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు క్యాంప్ కొనసాగుతుందని, పీడీలు రామచంద్ర, వెంకటేశ్వర్లు, రాజేంద్ర ఆధ్వర్యంలో బాల, బాలికలకు శిక్షణ అందిస్తామని వెల్లడించారు. వివరాలకు 9440934507 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 3,458 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆపరేషన్ పరిధిలో 138 సర్వీసులు, తిరుపతి రూరల్–56, పుత్తూరు–102, చిత్తూరు అర్బన్–68, చిత్తూరు రూరల్–70, మదనపల్లె–83, పీలేరు–60, పుంగనూరు పరిధిలో 88 కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో అదనపు లోడ్ క్రమబద్ధీకరణ కింద 520 కేసులకు రూ.12.94 లక్షలు, విద్యుత్ చౌర్యం పరంగా 144 కేసులకు రూ.1.33 లక్షల జరిమానా విధించినట్లు వివరించారు. మొత్తం 665 సర్వీసులకు రూ.14.27 లక్షలు చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

పాఠశాలల్లో సామగ్రి భద్రతకు ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఖరీదైన సామగ్రిని జాగ్రత్తగా భద్రపరచాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. శనివారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు స్పష్టం చేశారు. దసరా సెలవులు ప్రారంభం కావడంతో బడులు మూతపడ్డాయని, ప్రతి పాఠశాలలో నాడు–నేడు, ఇతర పథకాలకు సంబంధించిన రూ.లక్షల విలువైన సామగ్రి ఉందని వెల్లడించారు. సెలవులు పూర్తయ్యేవరకు ఆ సామగ్రి అపహరణకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



నేటి నుంచి బోయకొండలో దసరా ఉత్సవాలు

బోయకొండ(చౌడేపల్లె) : బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం నుంచి దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయ ఈఓ చంద్రమౌళి మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిత్యం ఓ ప్రత్యేక అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వివరించారు. ఈ మేరకు సేవల వివరాలను తెలియజేస్తూ జిల్లాతోపాటు కర్ణాటక, తమిళనాడులో సైతం పోస్టర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే గంగమ్మతల్లి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో ఉభయకర్తలుగా పాల్గొనదలచిన వారు రూ.5,116 చెల్లించాలని సూచించారు. దుర్గా సప్తశతి చండీహోమంలో పాల్గొనేవారు రూ.2,116 చెల్లించాలని తెలిపారు. శ్రీచక్ర దాయిని పూజలో పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించాలన్నారు. ఉభయకర్తలకు అమ్మవారి ప్రసాదం, పవిత్ర శేషవస్త్రం, చీరతో పాటు జాకెట్ పీస్, అమ్మవారి కుంకుమ, గాజులు, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు వివరాలు.ఉభయదారుల తమ పేరు నమోదు చేసుకునేందుకు 7901642845,7901642846 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



బోయకొండ గంగమ్మ ఆలయం,
(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అమ్మవారికి విశేషాలంకరణలు

- 15వ తేదీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం
- 16న పార్వతీదేవి అలంకారం
- 17వ శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం
- 18న ధనలక్ష్మీదేవి అలంకారం
- 19 శాకాంబరీదేవి అలంకారం
- 20న సరస్వతీదేవి అలంకారం
- 21న దుర్గాదేవి అలంకారం
- 22న మహిషాసుర మర్ధని అలంకారం
- 23న రాజరాజేశ్వరీదేవి అలంకారం

దాడి చేసిన నలుగురిపై కేసు

పూతలపట్టు : మండలంలోని ఎర్రచెరువుపల్లె హైస్కూల్ వద్ద వంశీ అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. ఐరాల మండలం అగ్రహారంపల్లెకు చెందిన వంశీ తన స్నేహితులు అవినాష్, ప్రసన్నతో కలిసి హైస్కూల్ మైదానంలో మాట్లాడుకుంటున్నారు. ఇంతలో విజయ్, హేమచంద్ర, రాజ్‌కుమార్, రాములు కలిసి వంశీతోపాటు అతడి కారుపై రాళ్లు, బీరుబాటిళ్లతో దాడి చేశారు. బాధితుడు ఈ మేరకు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే టీడీపీ వర్గీయులపై వైఎస్సార్‌సీపీ వాళ్లు దాడి చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ గొడవలో పార్టీలకు ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్



మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు : పట్టణంలోని రహమత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను అనుమతి లేకుండా పగులగొట్టి పైపులైన్లు వేయించిన ఇద్దరు ఉద్యోగులను మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ శనివారం సస్పెండ్ చేశారు. పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించాల్సి ఉండగా, గురువారం రాత్రి అక్కడి ఏర్పాట్లను పరిశీలించేందుకు కమిషనర్ వెళ్లారు. ఆ సమయంలో నూతనంగా నిర్మించిన రోడ్లు ధ్వంసమై ఉండడం గమనించారు. మంత్రి పర్యటన సమయంలో రోడ్లు పగులగొట్టి ఇబ్బంది కలిగించిన మున్సిపల్ నీటి విభాగం ఫిట్టర్ ఇన్‌చార్జ్ జహీర్, 4వ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ పురుషోత్తాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్లను అనుమతి లేకుండా పగులగొడితే సహించే ప్రసక్తే లేదన్నారు. ఇలాంటి ఘటనలపై ఆయా వార్డుల కౌన్సిలర్లు, వలంటీర్లు తమకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థుల అదృశ్యంపై కేసు



అంజాద్‌ఖాన్ ఆసిఫ్

పుంగనూరు : పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన నూరుల్లాఖాన్ కుమారుడు పి.అంజాద్‌ఖాన్ (17), అతడి స్నేహితుడు ఎస్.ఆసిఫ్ (16) శుక్రవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సుకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అంజాద్, ఆసిఫ్ మదనపల్లెలో ఇంటర్ చదువుతున్నారని, కాలేజీకి వెళ్లినవారు రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నవోదయ దరఖాస్తుకు 31వ తేదీ ఆఖరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి 2024 ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్.విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 9వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మే 1, 2009 నుంచి జూలై 31 2011మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలన్నారు. ఇతర వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. పరీక్ష 2024 ఫిబ్రవరి 10వ తేదీన ఉంటుందన్నారు.



సారా కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: సారా తయారీ, విక్రయాల కేసుల్లో పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న శశికుమార్ (33) అనే నిందితుడిని ఎస్‌ఈబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. సీఐ జోగేంద్ర మాట్లాడుతూ గుడిపాల మండలం చిత్తపార గ్రామంలో నిర్వహించిన దాడుల్లో శశికుమార్ వద్ద 50 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. నిందితుడు సారా తయారు చేసి చుట్టు పక్కల గ్రామాలతో పాటు తమిళనాడులో సైతం విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. గతంలో కూడా ఇతడిపై మూడు సారా కేసులు నమోదయ్యాయని, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని వెల్లడించారు. దాడిలో ఎస్‌ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది బాబు, శంకర్ నాయక్, వెంకటేశ్వర్లు, జయశంకర్ పాల్గొన్నారు.

టీటీడీ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ : టీటీడీకి చెందిన శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్వీ ఓరియంటల్ కళాశాల, ఎస్వీ సంగీత, నృత్య కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కళాశాలల్లో సంప్రదించాలని టీటీడీ అధికారులు తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి హాస్టల్ వసతి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వర్తించవు.



గ్రూప్–4 ఉద్యోగిగా శ్రీలక్ష్మి



మంత్రుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న శ్రీలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరుకు చెందిన శ్రీలక్ష్మి గ్రూప్–4 లో అర్హత పొంది ఉద్యోగం సాధించారు. ఎస్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సురేష్ బాబు, ఈశ్వరమ్మ దంపతుల కుమార్తె శ్రీలక్ష్మి ఈ మేరకు శనివారం విలేకర్లతో మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–4 పరీక్షలు నిర్వహించిందన్నారు. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాగానే పరీక్షకు ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా నియామకపత్రం పొందడం ఆనందంగా ఉన్నట్లు వివరించారు.

వైఎస్సార్సీపీలోకి పలువురు నేతలు



నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెకు చెందిన పలువురు నేతలు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో శనివారం వైఎస్సార్సీపీలో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గుల్లాతన్నగారి నారాయణప్ప, వార్డు మెంబర్ జి.త్యాగరాజు, గంగులప్పగారి ఈశ్వర, ఎం.రఘుపతి, వై.రవికుమార్, బత్తిని చంద్రశేఖర్, మునిరాజ, మేఘనాథం, కోట్ల రఘునాథరెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు తమ అనుచరులతో పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు.

గోవిందరాజుల గుట్టపై ప్రత్యేక పూజలు





శ్రీవారి పాదానికి హారతి సమర్పిస్తున్న ఎంసీ విజయానందరెడ్డి, విశేష పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: గోవులకు మేత ఇచ్చే ఈ గుట్టనే పూర్వీకులు గోవిందరాజుల గుట్టగా పిలిచేవారని, ఇలాంటి స్థలంలో శ్రీవారి పాదం వెలుగులోకి రావడం అత్యంత పవిత్రమని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. పెరటాసి నెలను పురస్కరించుకుని చిత్తూరు మండలం టి.వేపనపల్లి గ్రామ సమీపంలో వెలసిన గోవిందరాజుల గుట్టలోని శ్రీవారి పాదానికి శనివారం అత్యంత వైభవంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, కోలాటం, భజనలతో అలరించారు. గోవింద నామస్మరణలతో గుట్ట మార్మోగింది. విజయానందరెడ్డి శ్రీవారి పాదానికి పాలాభిషేకం చేశారు. కర్పూర హారతి ఇచ్చి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ పవిత్ర స్థల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ మధు, తదితరులు పాల్గొన్నారు.



కిటకిటలాడుతున్న గోవిందరాజుల గుట్ట

విజ్ఞాన ‘కౌశల్’

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్
- నవంబర్ 5 వరకు దరఖాస్తుకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు విజ్ఞానశాస్త్రంపై ×కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్× నిర్వహించనున్నారు. ఈ మేరకు భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో క్విజ్, పోస్టర్ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేయనున్నారు. ఇందుకోసం విద్యార్థులు నవంబరు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలకు www. bvmap.org వెబ్‌సైట్ లేదా 9985139609,8185002909 నంబర్లను సంప్రదించవచ్చు.

పోటీలు ఇలా..

విద్యార్థులకు గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులతో పాటు ‘విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి’ అనే అంశంపై ప్రాథమిక స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో పోటీలు ఉంటాయి. ఒక పాఠశాలలో మూడు తరగతుల విద్యార్థులకు వచ్చిన మార్కులను కలిపి పాఠశాలకు మార్కు నిర్ణయిస్తారు. జిల్లాలో మొదటి 36 స్థానాల్లో నిలిచిన పాఠశాలలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.



దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ చిత్రం

పోస్టర్ ప్రజెంటేషన్ ఇలా..

‘జనరల్ థీమ్...జీవ వైవిధ్యం, వాతావరణ మార్పు –పర్యావరణం, నీటి పొదుపు, విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయుల కృషి’ అనే అంశాలపై పోటీలు ఉంటాయి. ఒక పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థుల నుంచి ఇద్దరి పోస్టర్ ప్రజెంటేషన్‌ను మాత్రమే అప్‌లోడ్ చేసే అవకాశముంటుంది. జిల్లాస్థాయికి 36 పోస్టర్లను ఎంపిక చేస్తారు.

వివాహిత ఆత్మహత్య

పుంగనూరు : మండలంలోని బోడేవారిపల్లెకు చెందిన అనిత (23) అనే వివాహిత శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కర్ణాటకకు చెందిన గణపతి కుమార్తె అనితను బోడేవారిపల్లెకు చెందిన మనోహర్‌కు ఇచ్చి 18 నెలల క్రితం వివాహం చేశారు. భర్తతో పాటు అత్త సరోజనమ్మ తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో అనిత పురుగుల మందు తాగేసినట్లు మృతురాలి తండ్రి ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనోహర్, సరోజనమ్మపై కేసుపై నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

లారీని ఢీకొన్న కారు : ముగ్గురికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన అశోక్, మురళి, కిరణ్ కారులో బెంగళూరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కిరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







